క్లుప్తంగా



విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన నిధులు విడుదల చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పామర్రుకు వచ్చారు. ఆయనకు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్

కానూరులో జగనన్న ఆరోగ్య సురక్ష



పెనమలూరు: కానూరు తులసీనగర్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న వైద్యురాలు మంజుల మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గ్రామాలలోని ప్రజలు ఈ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దాదాపు 100 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పన్నుల పై వడ్డీ మాఫీ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరావు శుక్రవారం వివరాలు తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 35 ప్రకారం పన్నుల పాతబకాయితో పాటు, 2023–2024 సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను మొత్తం ఈ నెల 31వ తేదీ నాటికి ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామన్నారు. వడ్డీతో ఏప్రిల్ 2023 నుంచి ఫిబ్రవరి 2024 వరకు పాతబకాయి చెల్లించిన ఆస్తి పన్నుదారులకు వడ్డీని 2024–2025 సంవత్సరానికి సర్దుబాటు చేస్తామని చెప్పారు. ఆస్తి పన్నుదారులు, ఖాళీ స్థలాల యజమానులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు మున్సిపాలిటీ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వణుకూరులో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



పెనమలూరు: వణుకూరు గ్రామంలో నలందా డిగ్రీ కాలేజీ ఆధ్వర్యాన వారం రోజుల పాటు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి. వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామంలో శుక్రవారం ఆయన శిబిరం ప్రారంభించి ప్రసంగించారు. వారం రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో ప్రజా ఉపయోగ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రధానంగా విద్య ఆవశ్యకత, పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ ఇలా అనేక కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కలిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు చక్క గోపీకృష్ణ, నాగరాజు, దుర్గారావు, భాను, కిషోర్, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురామ్, 50 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆపాత మధురాలు సంగీత కార్యక్రమం సినీ క్లాసికల్ విశిష్టతను చాటింది. కార్యక్రమాలను సంస్థ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం లాంటి సంగీత కళాకారులు అరుదుగా కనిపిస్తారన్నారు. తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన గాయకుడు ఘంటసాల మాస్టారని, బాలసుబ్రహ్మణ్యం వివిధ భారతీయ భాషలలో 50 వేలకు పైగా పాటలు పాడారని గుర్తుచేశారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు పలు క్లాసికల్ చిత్ర గీతాలను ఆలపించారు.

కోడి పందేలు ఆడుతున్న వ్యక్తుల అరెస్టు

పెనమలూరు: కోడిపందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగూరులో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 3770, పుంజులు, కత్తులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నున్నలో ప్రగతి పరుగులు

- కోట్లాది రూపాయలతో గ్రామంలో అభివృద్ధి
- రూ. 1.20 కోట్లతో నాడు–నేడు పనులు



నున్న హైస్కూల్‌లో నాడు-నేడులో భాగంగా నిర్మిస్తున్న తరగతి గదులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో గతంలో ఎన్నడూలేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు జరిగాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోని నున్న గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల చెంతకు గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామంలో రూ. 80 లక్షలతో రెండు సచివాలయ భవనాలు నిర్మించింది. రైతుల కోసం రూ. 70 లక్షలతో మూడు రైతు భరోసా కేంద్రాలను, రూ. 35 లక్షలతో రెండు వైఎస్సార్ హెల్త్ విలేజీ క్లినిక్‌లను నిర్మించారు. కోటి 40 లక్షల రూపాయలతో రెండు లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను నిర్మించడం జరిగింది. జలజీవన్ మిషన్ నిధులు కోటి 10 లక్షల రూపాయలతో 40 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్, ఏడు కిలో మీటర్ల పైపులైన్లు, బోర్లను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామ పంచాయతీ నిధులు కోటిన్నరతో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్‌ట్లు, తాగునీటి అవసరాలకు పైపులైనుతో పాటు మినీవాటర్ ట్యాంక్‌లను నిర్మించారు. నున్నలో అర్హులైన 1267 పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. వాటిలో 200 గృహాలు నిర్మాణాలను పూర్తి చేసుకున్నాయి. జగనన్న కాలనీ ప్రజలకు విద్యుత్ సదుపాయం, నీటి సరఫరాను సమకూర్చడం జరిగింది. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు సరిపోక విద్యార్థులను చెట్ల కింద కూర్చోబెట్టి తరగతులు నిర్వహించేవారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ. 1.20 కోట్లతో నాడు–నేడులో భాగంగా పది తరగతి గదులను మంజూరు చేసి నిర్మిస్తున్నారు. మొదటి విడతగా రూ. 56 లక్షలతో టెన్ కాంపోనెంట్స్‌లో మౌళిక సదుపాయలను కల్పించడం జరిగింది.



నున్నలో సచివాలయ భవనం



వాటర్ ట్యాంక్

శరవేగంగా అభివృద్ధి పనులు..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నున్న గ్రామంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా గ్రామంలో అభివృద్ధి పనులను పూర్తి చేయడం జరిగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ముందు చూపుతోనే గ్రామంలో ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేస్తున్నాం.

– కాటూరి సరళశ్రీనివాస్, గ్రామ సర్పంచ్

విద్యార్థులకు మౌళిక సదుపాయాలు..



గతంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సరిపడినన్ని తరగతి గదులు లేక చెట్ల కింద విద్యార్థులు పాఠాలు వినేవాళ్లు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రూ. 1.20 కోట్లతో పది తరగతి గదుల నిర్మాణం జరుగుతోంది. నాడు–నేడు మొదటి ఫేజ్‌లో రూ. 56 లక్షలతో మౌళిక సదుపాయాలు కల్పించారు.

– గద్దం కుమార్, నున్న గ్రామస్తుడు

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



కానూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్

పెనమలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సామాజిక న్యాయం జరుగుతుందని తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ అన్నారు. కానూరు మురళీనగర్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాతనే పేద, మధ్య తరగతి ప్రజలకు న్యాయం జరిగిందని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేసి పేద కుటుంబాలకు భరోసాగా నిలిచారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు అభివృద్ధి సాధించాలంటే జగనన్న సీఎంగా ఉండాలని తెలిపారు. ప్రజలు వాస్తవాలు గుర్తించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. నేడు జగనన్న పాలనలో పేద విద్యార్థులు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అభ్యశిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు శివరామ కృష్ణ, పార్టీ నాయకులు వేమూరి బాలకృష్ణ, కాకర్ల సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

వేకువజామునే పింఛన్ల పంపిణీ



తాడిగడపలో అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఫణీంద్ర

పెనమలూరు: వైఎస్సార్ పింఛన్ కానుకను ఆయా గ్రామాల్లోని వలంటీర్లు శుక్రవారం వేకువజామునే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పెనమలూరు మండలంలో 5,823 మందికి రూ. 1,73,68,500, తాడిగడప మున్సిపాలిటీలో 12,965 మందికి రూ. 3,90,54,500 సొమ్ము ప్రభుత్వం మంజూరు చేసింది. తాడిగడప కార్మికనగర్‌లో అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలు సీతమ్మకు సచివాలయం–2 వలంటీర్ జి.ఫణీంద్ర పింఛన్ సొమ్ము అందజేశారు. మొదటి రోజే మండల పరిధిలో 70 శాతం పింఛన్‌లు పంపిణీ చేశారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను ఆయా గ్రామాల్లోని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది శక్రవారం తెల్లవారుజాము నుంచే పంపిణీ చేశారు. రామవరప్పాడులో 80 శాతం, ఎనికేపాడులో 98 శాతం, ప్రసాదంపాడులో 80 శాతం, నిడమానూరులో 83 శాతం పంపిణీ చేశారు.

ఉంగుటూరు: మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో 8207 మంది ఫించన్ లబ్ధిదారులు ఉండగా 5933 ఫించన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మహేశ్వరరావు తెలిపారు. ముక్కపాడు గ్రామ సచివాలయం పరిధిలో వేమండ గ్రామంలో శనగవరపు శేషరత్నం అనే వృద్ధురాలికి వేలిముద్రలు పడకపోవడంతో ఆమెకి వెల్‌ఫేర్ అసిస్టెంట్ షేక్ లాల్‌బీ, వలంటీర్ మన్నెంపల్లి రిబ్కా శుక్రవారం ఐరిష్ ద్వారా వృద్ధాప్య పింఛన్ అందజేశారు.



వేమండలో వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వెల్‌ఫేర్ అసిస్టెంట్ షేక్ లాల్‌బీ

విజయవాడరూరల్: విజయవాడరూరల్ మండలంలో శుక్రవారం 78.09 శాతం పింఛన్ల పంపిణీ జరిగినట్లు ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 17498 మంది లబ్ధిదారులకుగానూ ప్రభుత్వం రూ. 5,25,35,500 విడుదల చేసిందని ఎంపీడీఓ తెలియజేశారు.

ఓటర్ల దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు

గన్నవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సహాయక ఎన్నికల నమోదు అధికారి, తహసీల్దార్ ఎస్ఎస్. పవన్‌కుమార్ పోలింగ్ కేంద్రాల మార్పు ప్రతిపాదనలు, ఓటరు దరఖాస్తు జాబితా వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో ఓటర్లు సమర్పించిన చేర్పులకు సంబంధించిన దరఖాస్తులు 419, తొలగింపుల దరఖాస్తులు 3,262, పేరు, అడ్రస్ మార్పులకు సంబంధించి 1,150 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. పెండింగ్ దరఖాస్తులను నిర్ణీతకాల వ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎలక్షన్ ఇన్‌చార్జి రామిశెట్టి వెంకటేశ్వరరావు, గన్నవరం మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, కాంగ్రెస్ నాయకుడు సుంకర వీరభద్రరావు, సీపీఎం నేత కైలే యేసుపాదం, ఎన్నికల డీటీ ఏఎస్ఆర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూ రక్షతో మార్గం సుగమం



డ్రెయిన్ కాలువ గట్టుపై ఉన్న ఆక్రమణ



డ్రెయిన్ కాలువ గట్టుపై ఉన్న ఆక్రమణ

ఉంగుటూరు: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష సర్వేతో పెద అవుటపల్లి–కొయ్యగూరపాడు డ్రెయిన్ గట్టుపై ఎంతో కాలంగా ఉన్న ఆక్రమణలు తొలగిపోయి పంట పొలాల్లోకి మార్గం సుగమం అవడంతో ఆ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొయ్యగూరపాడులో డ్రెయిన్ కాలువ గట్టు ఎన్నో ఏళ్లుగా ఆక్రమణకు గురికావడంతో పండించిన పంటను రవాణా చేయలేక పంటను వేయలేకపోయామని రైతులు చెబుతున్నారు. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న శాశ్వత భూరక్ష పథకంతో కాలువ గట్టు విస్తీర్ణం సర్వే అధికారులు గుర్తించి హద్దులు వేసి రాళ్లు పాతారు. అదే విధంగా రెండు రోజుల్లో గట్టుపై మార్గం వేసేందుకు ఆక్రమణ తొలగింపు చర్యలు తీసుకుంటామని ఆరుగొలను డ్రైనేజీ ఏఈ ఉదయ్‌కిరణ్ తెలపడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న భూరక్షతో రైతులకు మేలు..



జగనన్న భూరక్ష సర్వేతో గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములు, రైతుల భూముల హద్దులు గుర్తించడం ద్వారా శాశ్వత భూ హక్కుతో రైతులకు మేలు జరుగుతుంది. ఆక్రమణలతో ఎన్నో ఏళ్లుగా తమ పొలంలో పండించిన పంటను రవాణా చేయలేకపోయాం. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన భూ సర్వేతో ప్రభుత్వ స్థలం గుర్తించారు. అదే విధంగా గుర్తించిన కాల్వ గట్టుపై మార్గం వేస్తే బీడుగా మారిన పొలాలను సాగులోకి తీసుకువస్తాము. రైతులకు మేలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– నాగులపల్లి పద్మ, స్థానికురాలు

5న సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఉంగుటూరు: మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులపై నిర్వహించిన 15వ విడత సామాజిక తనిఖీపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 5వ తేదీన ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ ద్వారా వివిధ గ్రామాల్లో జరిగిన పనులపై ఫిబ్రవరి 14 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన సామాజిక తనిఖీల నివేదికలపై మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహిస్తామని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధి హామీ మేట్‌లు, కూలీలు హాజరుకావాలని కోరారు.

క్రీస్తు బోధనలకు అనుగుణంగా సేవాభావాన్ని చాటాలి



మాట్లాడుతున్న ఫాదర్ థామస్

గన్నవరం: క్రీస్తు బోధనలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఆర్‌సీఎం విచారణకర్త ఫాదర్ పసల థామస్ పిలుపునిచ్చారు. స్థానిక అద్భుత బాలయేసు దేవాలయంలో శుక్రవారం కథోలిక తపస్సు కాలంలో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత దివ్యప్రసాద ఆరాధనతో వాక్య పరిచర్య, దివ్యబలిపూజ జరిపారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి థామస్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి అనుసరణీయమన్నారు. ముఖ్యంగా క్రీస్తు చూపిన బాటలో పశ్చాతప మనస్సుతో కూడిన జీవితం సంతోషాన్ని కలిగిస్తుందని తెలిపారు. గన్నవరం విచారణ పరిధిలోని గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఈకేవైసీ ప్రక్రియ పూర్తి



కంకిపాడు ఆర్‌బీకేలో జాబితాను ప్రదర్శిస్తున్న ఏఓ కిరణ్

కంకిపాడు: రబీ సీజన్‌కు సంబంధించి మండలంలో ఈకేవైసీ ప్రక్రియ పూర్తయ్యిందని మండల వ్యవసాయాధికారి కిరణ్ తెలిపారు. మండలంలోని ఆయా రైతుభరోసా కేంద్రాల్లో రైతుల జాబితాను శుక్రవారం ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా ఏఓ కిరణ్ మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్‌కు 14,571 ఎకరాల్లో పంట నమోదు జరిగిందన్నారు. 3,185 మంది రైతులకు ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉండగా లక్ష్యానికి అనుగుణంగా ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. పంట నమోదు వివరాలను సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించామన్నారు. ఈ నెల మూడో తేదీ వరకూ జాబితాలను పరిశీలించి అభ్యంతరాలను వ్యక్తం చేయవచ్చని సూచించారు. మార్పులతో కూడిన జాబితాను ఈ నెల ఎనిమిదో తేదీన ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతుభరోసా కేంద్రాల సహాయకులు పాల్గొన్నారు.

పంటల నమోదు జాబితా ప్రకటన

పెనమలూరు: రైతులు రబీ పంటకు సంబంధించి నమోదు చేసిన పంటల వివరాల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రకటించామని మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ తెలిపారు. శుక్రవారం ఆమె వివరాలు తెలుపుతూ రబీలో వరి 986 హెక్టార్లు, జొన్న 516 హెక్టార్లు, మొక్కజొన్న 196 హెక్టార్లు, మినుము 111 హెక్టార్లు, పెసర 52 హెక్టార్లు ఈక్రాప్ బుక్‌లో నమోదు చేశామన్నారు. ఈ పంటలకు సంబంధించి 816 రైతుల పేర్లు నమోదు చేశామన్నారు. పంటల వివరాలు, రైతుల పేర్లు సోషల్ ఆడిట్ నిమిత్తం ఆయా రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. రైతులు తాము ప్రకటించిన జాబితాను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ నెల మూడో తేదీ లోపు అభ్యంతరాలు ఉంటే తెలపాలని, ఎనిమిదో తేదీన తుది జాబితా ఖరారవుతుందని పేర్కొన్నారు. రైతుల వద్ద ఈకేవైసీ కూడా తీసుకున్నామని ఏఓ శైలజ తెలిపారు.

రేపు పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి

పెనమలూరు: మండల పరిధిలో ఆదివారం జరగనున్న పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి చేశామని మండల వైద్యాధికారి బిజిలి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన వివరాలు తెలుపుతూ మండల పరిధిలో పల్స్ పోలియో 3,4,5 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. మూడో తేదీన పల్స్ పోలియో కేంద్రాల్లో, 4,5 తేదీల్లో వైద్య సిబ్బంది ఆయా ప్రాంతాల్లో ఇళ్ల వద్ద పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. మండలంలో 45 కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొబైల్ టీమ్‌లు కూడా ఉన్నాయని చెప్పారు. తల్లితండ్రులు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

రామవరప్పాడు: మండల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి 25 సచివాలయాల పరిధిలో 34 పల్స్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి నిరంజన్ శుక్రవారం తెలిపారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంపీహెచ్‌ఏలు, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్త్ సూపర్‌వైజర్లు పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

గన్నవరం రూరల్: ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీహర్ష పేర్కొన్నారు. మండలంలోని అయిదు సంవత్సరాల్లోపు వయస్సు గల చిన్నారులు 4,834 మంది ఉన్నట్లు తెలిపారు. వీరందరికీ పోలియో నివారణ చుక్కలు వేయడానికి ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. తల్లిదండ్రులు తమ సమీపంలో ఏర్పాటు చేస్తున్న పల్స్ పోలియో కేంద్రంలో చుక్కల మందు వేయించాలని సూచించారు.

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

గన్నవరం: స్థానిక వీకేఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈ సెంటర్‌లో మొత్తం 560 మంది విద్యార్థులకు గాను 546 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా స్థానిక చైతన్య కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలోనూ ఇంటర్ పరీక్షలు జరిగాయి.

రమాశంకర్ సామాజిక సేవలు అభినందనీయం



రమాశంకర్, జిలానీఖాన్ సంస్మరణ సభలో పాల్గొన్న కళా సంస్థల ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: సినీ నిర్మాత, దర్శకుడు ఒమ్మి రమాశంకర్ సామాజిక సేవలు అభినందనీయమని సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సేవా సంస్థ, సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్మాత దర్శకుడు ఒమ్మి రమాశంకర్, కళాపోషకుడు జిలానీఖాన్‌ల సంస్మరణ సభ నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ రమాశంకర్ దర్శకునిగా యువ నటులు కొందరిని తెలుగు తెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. విశ్రాంత ఐటీసీ అధికారి వీరభద్రరావు మాట్లాడుతూ రమాశంకర్ నగరానికి వచ్చిన అనతికాలంలోనే గాయనీ గాయకుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మాట్లాడుతూ తన మురగా చారిటబుల్ సంస్థ ద్వారా పేద కళాకారులకు ఆర్థిక సహాయం చేశారని, నిర్మాత, దర్శకత్వం వహించిన అరణ్య సినిమాలో నూతన నటులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. సంస్మరణ సభలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు మారేపల్లి జోషి, కారుమంచి రాజు, శ్యాంప్రసాద్, దామోదర గణపతిరావు, సింగంపల్లి రమణ, కొప్పుల ఆనంద్ తదితరులు రమాశంకర్‌తో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పలువురు కళాకారులు, వివిధ సంస్థల ప్రతినిధులు రమాశంకర్ చిత్రపటానికి నివాళి సమర్పించారు.

ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం

అంబాపురం(విజయవాడరూరల్): ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్‌మాదిగ అన్నారు. అంబాపురం గ్రామంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పేటేటి కిషోర్ అధ్యక్షతన మాదిగ అమరవీరుల దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సురేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అమరులైన మాదిగ వీరులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతీ మాదిగ బిడ్డపై ఉందన్నారు. వారి త్యాగాలు వృధాకాబోవని త్వరలోనే కృష్ణమాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషామాదిగ, గ్రామ అధ్యక్షుడు సొంగా దయాకర్‌మాదిగ, మండల అధ్యక్షుడు వంశీమాదిగ, ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి ఎడ్లమాటి బాబురావు, గ్రామ మాజీ సర్పంచి తోడేటి విజయకుమార్, తోడేటి బెంజిమెన్, మాడుగల రాజు పాల్గొన్నారు. తొలుత అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు.

నున్న: మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో నున్న గ్రామంలో అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి కృష్ణాజిల్లా ఎమ్మెస్పీ ప్రధాన కార్యదర్శి మందా వేణుబాబుమాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యాన రానున్న రోజుల్లో మాదిగల చిరకాల వాంఛ ఎస్సీ వర్గీకరణ నెరవేరనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకుడు దేవరపల్లి విక్టర్‌బాబు, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు తగరం విజయ్‌కుమార్, కోట కుమార్, పొరిటిగడ్డ దేవదాసు పాల్గొన్నారు.